# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 42 20-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో


తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



# ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!

- ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఐబీఎం, ఐఐటీ మద్రాస్, ఎన్విడియా వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు
- 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీలో నైపుణ్య శిక్షణ
- కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. రేపు (ఫిబ్రవరి 20) ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి, యువతకు నైపుణ్య శిక్షణకు మార్గం సుగమం చేసేలా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకోనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు

మిగతా 2లో





# మంచి ఫలితాలు సాధించారు

## రేవంత్ రెడ్డి సహా తెలంగాణ నేతలకు ఖర్గే, రాహుల్ గాంధీ ప్రశంసలు

ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సమావేశమైన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు

భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే

సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటన

2లో



## ఈ నెల 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు, 28న బడ్జెట్

- 23వ తేదీన మంత్రివర్గ సమావేశం
- 10 నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు
- మొదటి రోజు గవర్నర్ ప్రసంగం

# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే

- ఏపీ బడ్జెట్‌పై జగన్ విమర్శలు
- సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ
- రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు
- సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి
- నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

మిగతా 2లో





# త్వరలో మరో డీఎస్సీ ప్రకటిస్తాం

- సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగుల వేతనాల పెంపుదలపై చర్చిస్తామన్న మంత్రి
- తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటకలతో పోలిస్తే మన వద్ద వేతనాలు అధికంగా ఉన్నాయన్న మంత్రి
- సీజనల్ హాస్టళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్న నారా లోకేశ్

త్వరలో డీఎస్సీని ప్రకటిస్తామని, అలాగే సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగుల వేతనాల పెంపుదలపై బోర్డు సమావేశంలో చర్చిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసన సభలో ఎమ్మెల్యేలు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డీటీపీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి జీతాల

మిగతా 2లో




## ఢిల్లీ ఏఐ సదస్సులో మోదీ సమక్షంలో... చేతులు కలపని ఇద్దరు సీఈవోలు

- మోదీతో పాటు ఒకే వేదికపై కనిపించిన ప్రపంచ టెక్ దిగ్గజ కంపెనీల అధినేతలు
- చేతులు కలుపుతూ ఫోటో దిగిన మోదీ, టెక్ లీడర్లు
- చేతులు కలపని శామ్ ఆల్ట్‌మన్, డారియో అమోడెయ్

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

- రాబోయే బడ్జెట్‌లో హామీల అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్
- ఆరు గ్యారెంటీలు సహా 95 శాతం హామీలు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శ
- నిధులు కేటాయించకపోతే ప్రజలతో కలిసి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక
- గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలన్న బీఆర్ఎస్



2లో



2లో

## కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లుగా ఉంది

- కవిత పార్టీని స్థాపిస్తే భూస్థాపితమయ్యేది బీఆర్ఎస్ అన్న రామచందర్ రావు
- కవిత ఏ పార్టీ నుంచి ఓడిపోయారు, ఎవరి చేతిలో ఓడిపోయారో గుర్తుంచుకోవాలని వ్యాఖ్య
- కవిత పార్టీ స్థాపిస్తే తమకు ఏమీ కాదన్న రామచందర్ రావు

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లుగా ఉంది

మే నెల మొదటి వారంలో తమ పార్టీని ప్రకటిస్తామని తెలిపిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తెలంగాణలో బీజేపీ భూస్థాపితం అవుతుందని చేసిన వ్యాఖ్యలపై ఆయన విమర్శలు గుప్పించారు. కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లుగా ఉంది ఆయన వ్యాఖ్యానించారు. ఆమె పొరపాటున తమ పార్టీ పేరును పేర్కొన్నట్లుగా ఉందని అన్నారు. కవిత పార్టీని స్థాపిస్తే భూస్థాపితం అయ్యేది బీఆర్ఎస్ తప్ప తమ పార్టీ కాదని ఆయన అన్నారు. గత లోక్ సభ ఎన్నికల్లో కవిత ఏ పార్టీ నుంచి ఓడిపోయారు, ఎవరి చేతిలో ఓడిపోయారో ఒకసారి గుర్తుతెచ్చుకోవాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీకి ఓట్ల శాతం పెరిగిందని రామచందర్ రావు అన్నారు. కాగా, ఈరోజు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. శివాజీ దేశం కోసం, ధర్మం కోసం మొఘలులతో పోరాడారని అన్నారు. ఆయన తన హయాంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు.

# ఢిల్లీ ఏఐ సదస్సులో మోదీ సమక్షంలో... చేతులు కలపని ఇద్దరు సీఈవోలు

'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ చేతులు కలపకపోవడంపై చర్చనీయాంశంగా మారింది. దీని ద్వారా వారి మధ్య ఉన్న స్పర్థలు మరోసారి బయటపడ్డాయని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతోన్న ఈ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు ప్రపంచస్థాయి టెక్ దిగ్గజ కంపెనీల అధినేతలు ఒకే వేదికపై కనిపించారు. అందరూ గ్రూప్ ఫొటో దిగారు. ఆ సమయంలో శామ్ ఆల్ట్‌మన్, డారియో ఆమోడెయ్ పక్కపక్కనే నిల్చున్నారు. వీరు ప్రధాని నరేంద్ర మోదీకి పక్కనే ఎడమ వైపుకు నిలుచున్నారు. టెక్ లీడర్లంతా చేతులు కలిపినప్పటికీ, పక్కపక్కనే ఉన్న వీరు మాత్రం చేతులు కలపలేదు. ఇద్దరి మధ్య కొన్ని సంవత్సరాలుగా విభేదాలు ఉన్నాయి. డారియో అమోడెయ్, ఆయన సోదరుడు డానియెల్లా అమోడెయ్ ఇద్దరూ 'ఓపెన్ ఏఐ' సంస్థలో వైస్ ప్రెసిడెంట్స్ హోదాలో పనిచేశారు. శామ్ ఆల్ట్‌మన్ వారికి బాస్‌గా ఉన్నారు. అయితే ఆయన భద్రత కంటే వ్యాపారానికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తూ సోదరులిద్దరూ 'ఓపెన్ ఏఐ'ని వీడారు. 2021లో అమోడెయ్ 'ఆంథ్రోపిక్'ను ప్రారంభించారు. దీంతో వారి మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి.

# త్వరలో మరో డీఎస్సీ ప్రకటిస్తాం

పెంపుదలపై వచ్చే ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు సమావేశంలో చర్చిస్తామని, కేంద్రంతోను కూడా సంప్రదిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. శాసనసభలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడకుదిటి ఈశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డీటీపీ ఆపరేటర్ల జీతాలు దక్షిణ భారతంలోని తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే ఏపీలోనే అత్యధికంగా ఉన్నాయని అన్నారు. గతంలో 3 నెలలకోసారి జీతాలు ఇవ్వగా, ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన వారికి జీతాలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. సమగ్ర శిక్ష అనేది సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్ అని, ఇందులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందని వెల్లడించారు. అందువల్ల ఏ నిర్ణయం తీసుకున్నా కేంద్రప్రభుత్వ ఆమోదంతోనే తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాలో సీజనల్ హాస్టళ్లు పెంచాలన్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి చేసిన విజ్ఞప్తిపై మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, కర్నూలు జిల్లాలో అవసరమైన మేర నూటికి నూరు శాతం సీజనల్ హాస్టళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఆలూరు, ఆదోని, మంత్రాలయంలో పర్యటించినపుడు ఆ ప్రాంతం ఎంత వెనుకబడి ఉందో ప్రత్యక్షంగా చూశానని అన్నారు. నంద్యాల, కర్నూలు పార్లమెంటు నడుమ ఎంతో వ్యత్యాసం కనిపించిందని తెలిపారు. నిన్న జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో కర్నూలు పార్లమెంటు పరిధిలో వస్తున్న పరిశ్రమలకు అదనపు ఇన్సెంటివ్స్ ము కూడా ప్రజాప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు. ఆ ప్రాంతంలో పెద్దఎత్తున పెట్టుబడులు తెచ్చే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని అన్నారు. గత ఏడాది జరిగిన డీఎస్సీలో కూడా కర్నూలు జిల్లాకు ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ టీచర్ – స్టూడెంట్ రేషియో అక్కడ తక్కువగా ఉందని అన్నారు. త్వరలో మరో డీఎస్సీ ప్రకటించబోతున్నామని శుభవార్త చెప్పారు. అందులో కర్నూలు పార్లమెంటుపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని, ఆ ప్రాంతంలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం పదవీకాలం పూర్తికావస్తున్న తరుణంలో, ఇచ్చిన హామీల అమలుకు రాబోయే బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల అమలుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనైనా చిత్తశుద్ధి చూపాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటి అమలును పూర్తిగా పక్కన పెట్టిందని కేటీఆర్ తన లేఖలో విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 95 శాతం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. గత రెండు బడ్జెట్లలోనూ హామీల అమలుకు అవసరమైన కేటాయింపులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో 2026-27 బడ్జెట్‌లో అయినా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత, రైతుల కోసం ఇచ్చిన హామీల మేరకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓపిక నశిస్తోందని, వారిని ఇకపై వేచి చూసేలా చేయవద్దని సూచించారు. కేవలం గ్యారెంటీలే కాకుండా, ఎన్నికలకు ముందు వివిధ డిక్లరేషన్ల రూపంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలను కూడా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కేటీఆర్ కోరారు. గత రెండేళ్లుగా ఆయా వర్గాలకు చెల్లించాల్సిన నిధులు, బకాయిలను ఈ బడ్జెట్‌లో చేర్చి వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు. ఒకవేళ ఈ బడ్జెట్‌లో కూడా హామీల అమలుకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా 'మోసకారి కాంగ్రెస్'ను ప్రజల పక్షాన ఎక్కడికక్కడ నిలదీస్తాం అని కేటీఆర్ తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ సమాజం ఇంకెంతమాత్రం ఓపికపట్టే స్థితిలో లేదని, ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని తన లేఖలో స్పష్టం చేశారు.

# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే

"మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్‌లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ను



లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

# ఇరాన్‌లో 2 వేల మంది మృతి!

దుబాయ్, జనవరి 13: ఇరాన్‌లో ఖమేనీ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసనలు మరింత తీవ్రమయ్యాయి. నిరసనకారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. ఆందోళనల్లో 2 వేల మంది మరణించినట్టు స్వయంగా ప్రభుత్వమే అంగీకరించింది. మృతుల్లో పౌరులతో పాటు ప్రభుత్వ భద్రతా సిబ్బంది కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు, విధ్వంసకారుల చేతుల్లో ఈ మరణాలు సంభవించాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ సంఖ్యను విపక్షాల అనుకూల వెబ్‌సైట్ ఇరాన్ ఇంటర్నేషనల్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ భద్రతా దళాల చేతుల్లో 12 వేల మందికి పైగానే ఇరాన్ పౌరులు మరణించారని వెల్లడించింది. ఇది ఇరాన్ ఆధునిక చరిత్రలో అతి పెద్ద మారణ హోమంగా అభివర్ణించింది. ఇరాన్ ప్రభుత్వం సొంత భద్రతా సంస్థలు, ఇతర సంస్థల నుంచి అందిన సమాచారం మేరకు ఈ మృతుల సంఖ్యను పేర్కొన్నట్టు ఈ వెబ్‌సైట్ వెల్లడించింది. కాగా, ప్రస్తుతం దేశంలో ఇంటర్నెట్‌పై నిషేధం అమలువుతున్నందున పూర్తి సమాచారం అందడం లేదని, అందుకే మృతుల సంఖ్య స్పష్టంగా తెలియడం లేదని పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పౌరులు, భద్రతా సిబ్బంది మరణాల వెనుక ఉగ్రవాదుల హస్తం ఉందని ఒక ఇరాన్ అధికారి తెలిపారు. అయితే ఏ ఉగ్రవాదులు వారిని



చంపారో ఆయన వివరించ లేదు. గత మూడేండ్లుగా అంతర్గతంగా ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న ఇరాన్ గత ఏడాది అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు దాడి చేయడంతో మరింత కుదేలైంది. దీనికితోడు పాలకుల అణచివేత విధానాలు కూడా పౌరుల్లో తిరుగుబాటుకు దారితీసింది. 1979లో ఇస్లామిక్ విప్లవం తర్వాత అధికారంలో ఉన్న మతాధికారులు దేశంలోని నిరసనలు అణచివేయడానికి ద్వంద్వ విధానాలు అవలంబించారు. ఒక పక్క దేశంలో నెలకొన్న దుస్థితికి అమెరికా, ఇజ్రాయెల్ కారణమని ఆరోపిస్తూనే, కొందరు గుర్తు తెలియని ఉగ్రవాదులు ఆందోళనలను హైజాక్ చేశారని విమర్శిస్తున్నారు.

**అంతర్జాతీయ కాల్స్ పునరుద్ధరణ**


ఇరాన్‌లో ఆందోళనలతో దేశంలో కమ్యూనికేషన్ గురువారం నుంచి పూర్తిగా బంద్ అయిపోయింది. అయితే ఇంచుమించు ఐదు రోజు ల తర్వాత ఫోన్ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. తమ మొబైల్ ఫోన్ల నుంచి మంగళవారం ఇంటర్నేషనల్ కాల్స్ చేసుకోవడానికి పౌరులకు కొన్ని నిబంధనలతో అవకాశం కల్పించారు. ఇంటర్నెట్, టెక్స్ మెసేజ్‌లపై విధించిన నిషేధం మాత్రం కొనసాగుతూనే ఉంది. దీంతో పలువురు ఇరాన్‌వాసులు అసోసియేటెడ్ ప్రెస్, ఇతర మాధ్యమాల వారితో మాట్లాడారు. అయితే వారికి తిరిగి కాల్ చేస్తే ఫోన్లు వెళ్లలేదని దుబాయ్‌లోని ఏపీ బ్యూరో, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వర్గాలు తెలిపాయి.

ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగించాలని ఆ దేశ పౌరులకు పిలుపునిచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారికి సహాయం అందుతుందని హామీనిచ్చారు. 'ఇరాన్ దేశభక్తులారా, మీ నిరసనలు కొనసాగించండి.

# మంచి ఫలితాలు సాధించారు

:తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తెలంగాణ కాంగ్రెస్ నాయకులను అభినందించారు. ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, నామా నాగేశ్వరరావు ఆయనను కలిశారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ కూడా ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఫలితాలపై రాహుల్ గాంధీ, ఖర్గే అభినందించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించామని అన్నారు. తెలంగాణకు పార్టీ ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలుచేస్తామని స్పష్టం చేశారు. సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. ప్రజా తెలంగాణ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు.

# ఈ నెల 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు, 28న బడ్జెట్



త్వరలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 23వ తేదీన మంత్రివర్గ సమావేశం అనంతరం బడ్జెట్ సమావేశాల తేదీని ప్రకటించనున్నారు. పది నుంచి పదిహేను రోజుల పాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా మంత్రులు, అధికారులతో సమావేశమై ప్రతిపాదనలను స్వీకరించారు.

# ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!

చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు. రేపు ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు. కాగా, ఢిల్లీ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ సాయంత్రం జైపూర్ వెళ్లనున్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహ వేడుకకు హాజరై, రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం జైపూర్ నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకొని ఏఐ సదస్సులో పాల్గొంటారు.

# మంత్రుల అవినీతి, వారికి చెంచాగిరి చేస్తున్న ఐఏఎస్ అధికారుల జాబితా మా వద్ద ఉంది: బండి సంజయ్

తెలంగాణ కాంగ్రెస్ మంత్రుల అవినీతి చిట్టా తమ వద్ద ఉందని, ఇంకా బయటకు తీస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మంత్రులు చేస్తున్న అవినీతి ఆధారాలను సేకరిస్తున్నామని, ఈ మంత్రులకు కొందరు ఐఏఎస్ అధికారులు చెంచాగిరి చేస్తున్నారని ఆరోపించారు. మంత్రులకు చెంచాగిరి చేస్తున్న అధికారులు వాళ్లు సంపాదించుకుంటూ, మంత్రులకు ఎలా కూడబెడుతున్నారో తమకు తెలుసని అన్నారు.ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు పంపించడానికే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉందని బండి సంజయ్ అన్నారు. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా విప్పుతామని హెచ్చరించారు. అవినీతికి సంబంధించి ఆడియో రికార్డులు తమ వద్ద ఉన్నాయని అన్నారు. 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండదని జోస్యం చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు చెంప చెళ్లుమనిపించామని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి అధికార కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కయిందని ఆరోపించారు. బీజేపీని అడ్డుకునేందుకు ఆ మూడు పార్టీలు ఒక్కటయ్యాయని మండిపడ్డారు. తన మిత్ర పక్షం మజ్లిస్ కోసమే హైదరాబాద్‌ను ముఖ్యమంత్రి మూడు ముక్కలు చేశారని ఆరోపించారు.



## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

- చౌటుప్పల్‌లో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్
- విజేతలకు బహుమతుల ప్రదానం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఎఫ్‌పీఎస్‌టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి గురువారావు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి సృజనాత్మకతను వెలికి తీస్తాయని తెలిపారు. పోటీలో చౌటుప్పల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి జి. చరణ్ ప్రథమ బహుమతి సాధించగా, తంగడిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎల్. శ్రీజ ద్వితీయ బహుమతి పొందారు. విజేతలకు కోమటిరెడ్డి నరసింహారెడ్డి నగదు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివకుమార్, టాలెంట్ టెస్ట్ ఇంచార్జి వి.ఎ.కె. జోషి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ స్ఫూర్తితో యువత ముందుకుసాగాలి

- దిలావార్పూర్ లో శివాజీ విగ్రహ ఆవిష్కరణ
- ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఖానాపూర్ ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** హైందవ సామ్రాజ్య చత్రపతి శివాజీ ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఖానాపూర్ ఎమ్మెల్యే నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు ఖానాపూర్ మండలంలోని దిలావార్ పూర్ గ్రామంలో చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యేబొజ్జు పటేల్ గురువారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయానికి సాహసానికి శివాజీ నిలువుటద్దమని కొనియాడారు భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని ఎవరి సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోకుండా ఆచరించాలని తాతలు తండ్రులు మనకు నేర్పిన ఆచారాలను కొనసాగించాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని అన్నారు పరమత సహనంతో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి యుద్ధంలో ఓటమెరుగని ధీరుడులా శివాజీ మహారాజ్ మెలిగాడని పేర్కొన్నారు శివాజీ దిరుడు మాత్రమే కాదని గొప్ప పరిపాలన దక్షుడని న్యాయమైన పాలన అందించి ప్రజల మన్నా నలను పొందిన గొప్ప వ్యక్తి శివాజీ అని అన్నారు ఈ కార్యక్రమంలో వక్తగా వచ్చిన ముత్యంజీ శివాజీ గురించి ధార్మికంగా వివరించారు ఇంకా ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్ తో పాటు తహసిల్దార్ సుజాత రెడ్డి ఎంపీడీవో రమాకాంత్ ఎంపీ ఓ రత్నాకర్ రావు హనుమాన్ యూత్ అధ్యక్షులు హరిచరణ్ తో పాటు దిలావార్ పూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మార్పీఎస్ జెండా గద్దెను ధ్వంసం చేసిన వారిని కఠినం గా శిక్షించాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షు డు ఆరెల్లి మల్లేష్ మాదిగ



**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** ఎమ్మార్పీఎస్ జెండా గద్దెను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరేస్ట్ చేసి కఠినంగా శిక్షించా లని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్య క్షుడు మల్లేష్ మాదిగ డిమాం డ్ చేశారు. గురు వారం బజా ర్ హత్నూర్ మండల కేంద్రం లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్య క్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ పాల్గొని,రాజ్యాంగ నిర్మాత డా,,బి ఆర్ అంబేద్కర్ కు నివాళులు అర్పించిన అనం తరం ఆయన మాట్లా డుతూ బజార్ హత్నూర్ మండల కేం ద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద గత 30 సంవత్సరాలుగా జూ లై 7 తారీఖున ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాలను ఘ నంగా నిర్వహించడం కోసం గత జులై నెలలో జెండా గద్దె ను మెరుగులు దిద్దుతున్న క్ర మంలో అర్ధరాత్రి ఒక సామా జిక వర్గం చెందిన కొంతమంది వ్యక్తులు రాత్రి సమయంలో కూలగొట్టడం జరిగింది, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా స్థానిక ఎస్సై నిర్లక్ష్యం వహించడం జరిగింది, కావున పోలీసు ఉన్నత అధికారులు చొరవ తీసుకొని నిర్లక్ష్యం వహించిన ఎస్సైని మరియు మా జాతి ఆత్మగౌరవ జెండా గద్దెను కూలగొట్టిన ఆ యొక్క వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం, లేనిపక్షంలో ఉద్యమ కార్యచరణ తీసుకొని చర్యలు చేపట్టే అంతవరకు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాం, ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గోధుమల అనిల్ మాదిగ, సీనియర్ నాయకులు ఓడ్డేపల్లి గంగయ్య, బెక్కం నరసింహులు, దొమ్మటి అశోక్, గోనేకర్ తుకారాశీ సూర్యవంషి బాలాజీ,పెంట హనుమాన్లు, ఆశన్న, కూరెల్లి రామకృష్ణ, సామెర్ల రాజు, గోధుమల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకు కలెక్టరేట్.. రాత్రి 7 గంటల వరకు అర్జీల స్వీకరణ





- కష్టాల కడలిలో ఉన్న నిరుపేదలకు అండగా యంత్రాంగం
- పెండింగ్ వేతనాలు, పెన్షన్లపై కలెక్టర్ సీరియస్
- తక్షణమే సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశం
- పలు సమస్యలపై జిల్లా కలెక్టర్ వినతుల స్వీకరణ






**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 19 (తొలివెలుగు) :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వివిధ సమస్యలపై వినతులు అందాయి. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన ఏలూరి పద్మ తన భర్త మరణించి ఏడు సంవత్సరాలు గడిచినా వితంతు పింఛన్ మంజూరు కాలేదని ఫిర్యాదు చేశారు. భర్తకు వచ్చిన వికలాంగుల పింఛన్‌ను రద్దు చేసి తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించి గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రఘునాథపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు సరిపడ మౌలిక వసతులు కల్పించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, ఉత్తీర్ణత శాతం, సదుపాయాలపై అవగాహన కల్పించిన నేపథ్యంలో అవసరమైన సౌకర్యాలు పెంపొందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆత్మకూరు మండల తహసిల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. బాల నరసయ్య రికార్డు సహాయకుడిగా పదోన్నతి కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోచంపల్లి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులకు గత నాలుగు నుంచి తొమ్మిది నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదు చేయగా, వెంటనే వేతనాలు చెల్లించేలా జిల్లా పంచాయతీ అధికారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి వినతిని గంభీరంగా పరిగణించి, ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## మార్చి 15లోగా 'పీఎం శ్రీ' పనులు పూర్తి చేయాలి

- నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలి
- అధికారులతో 'పీఎం శ్రీ' నిధులపై సమీక్ష

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** పీఎం శ్రీ నిధుల నుంచి మంజూరైన పాఠశాలల్లో చేపట్టిన సివిల్ వర్క్స్ పనులను పెండింగ్ లేకుండా మార్చి 15లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీఎం శ్రీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. పాఠశాలలకు మంజూరైన నిధులను నిబంధనల ప్రకారం ఎంత మేర వినియోగించారో ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పీఎం శ్రీ పథకం పరిధిలోని పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ప్రయోగశాలలు, అదనపు తరగతి గదులు, గ్రంథాలయ గదుల నిర్మాణానికి మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కోటమర్తి, మల్లాపూర్, భువనగిరి గంజ్ పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి, నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా ఇంజనీర్ తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో సక్రమంగా అమలయ్యేలా ప్రధానోపాధ్యాయులతో నిరంతర సమన్వయం పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాల ప్రసాద్, డివిజనల్ ఇంజనీర్ శివకుమార్, ప్రధానోపాధ్యాయులు, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.





## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

- సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య శిబిరాల నిర్వహణకు వినతి
- ఎమ్మెల్యేను కలిసిన వికలాంగుల హక్కుల సాధన సమితి నేతలు
- దివ్యాంగులకు అండగా ఉంటా.. ఎమ్మెల్యే హామీ

**మునుగోడు/ హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ప్రతినిధులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గంలోని దివ్యాంగుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రత్యేకంగా ఆయన తల్లి పేరుతో నడుస్తున్న సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా మునుగోడులో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. స్పైనల్ కార్డ్, మస్కులర్ సంబంధిత దివ్యాంగులకు ప్రతి నెల అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర అవసరమైన సామగ్రి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మునుగోడు నియోజకవర్గంలోని దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా 'వికలాంగుల భవనం' నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సమితి ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, దివ్యాంగుల సమస్యల పట్ల తనకు ప్రత్యేక శ్రద్ధ ఉందని, మునుగోడులో ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జి పబ్బు రాజుగౌడ్, టీవీహెచ్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, రాష్ట్ర కార్యదర్శి మెరుగు శివకృష్ణ, మహిళా నాయకురాలు యశోద గోదా, కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం నాయకులు కొడిదల నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## కడెం లో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

**కడెం, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** మండల కేంద్రమైన కడెంలో గురువారం మరాఠా వీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బిజెపి కడెం మండల అధ్యక్షుడు కాశ వేణి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. చత్రపతి శివాజీ చూపిన మార్గంలో నడవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ మోహన్ నాయక్ , మండల ప్రధాన కార్యదర్శులు పూస శ్రీరామ్, రాపర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ధర్మపురి తిరుమలయ్య, సీనియర్ నాయకులు జక్కుల సత్తన్న, భూమన్న ములికి కృష్ణ, ఎస్ ప్రవీణ్, ఏ శ్రీనివాస్, రాపల్లి కొండయ్య, యూత్ నాయకులు రంజిత్ తరుణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## స్వామిగౌడ్ మృతికి ఎమ్మెల్యే నివాళి

- పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి
- అంతిమ యాత్రలో పాల్గొన్న రాజగోపాల్ రెడ్డి
- చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ కుటుంబానికి పరామర్శ





**చౌటుప్పల్, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** చౌటుప్పల్ పట్టణానికి చెందిన మొగుదాల స్వామిగౌడ్ (78) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. విషయం తెలిసిన వెంటనే మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొగుదాల రమేష్ గౌడ్ నివాసానికి చేరుకుని స్వామిగౌడ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అలాగే స్వామిగౌడ్ అంతిమయాత్రలో పాల్గొని తుదివీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అభిమానులు హాజరై నివాళులు అర్పించారు.

## కౌన్సిలర్ కీర్తి లవన్‌కు ఘన సన్మానం

- అభినందించిన మైనార్టీ జర్నలిస్టులు

**సూర్యాపేట, ఫిబ్రవరి 19 (తొలివెలుగు) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 19వ వార్డు కౌన్సిలర్ పిడమర్తి కీర్తి లవన్‌ను మైనార్టీ జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. గురువారం సూర్యాపేటలో జరిగిన కార్యక్రమంలో ఎస్.కె. రషీద్, ఎస్ఎన్ఐ పాషా, షేక్ జహీర్, నజీర్‌లు కౌన్సిలర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. వార్డు అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని వారు పేర్కొన్నారు. కౌన్సిలర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





## చల్లూరులో మెగా ఉచిత వైద్య శిబిరం

- మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో పరీక్షలు
- వ్యాధిగ్రస్తులకు ఆపరేషన్ల కోసం రిఫర్
- వైద్యులను అభినందించిన సర్పంచ్ రూప

**రాజాపేట, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** రాజాపేట మండలంలోని చల్లూరు గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల బృందం రక్తపోటు, షుగర్, గుండె సంబంధిత సమస్యలు, సాధారణ వ్యాధులపై పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన రోగులను తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రూప మాట్లాడుతూ.. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. వైద్యులను, నిర్వాహకులను ఆమె సన్మానించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.

## నాగభూషణ విద్యాలయంలో శివాజీ మహారాజ్ జయంతి

**ముధోల్, (తొలివెలుగు):** బాసర మండల కేంద్రంలోని నాగభూషణ విద్యాలయంలో గురువారం యోధుడు చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఛత్రపతి శివాజీ మహారాజ్, జీజమాత వేషధారణలో వచ్చి భక్తిని చాటారు. అనంతరం మరాఠా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రథంపై సవారి చేసి నిజమైన భక్తిని చాటుతూ సందడి చేశారు. విద్యార్థులు శివాజీ మహారాజ్ మన దేశ స్త్రీలనే కాకుండా సమాజంలోని అనేక రకాల స్త్రీలను రక్షించారని విద్యార్థులు ఉపన్యాసంలో పేర్కొన్నారు. మహారాజ్ జీవిత చరిత్ర ను ఉపన్యాసంలో వివరించారు. అంతకుముందు పాఠశాల ప్రిన్సిపాల్ బాబురావు జారికొటే శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా శివాజీ మహరాజ్ జయంతి జరుపుకుంటారని తెలిపారు. పరమత సహనం కలిగిన గొప్ప పాలనాధ్యక్షుడని తెలిపారు. శివాజీ మహారాజ్ చేసినటువంటి సేవలను కొనియాడారు. స్త్రీల పట్ల గౌరవము వారిని రక్షించిన తీరు విద్యార్థులకు వివరించారు. సమాజంలో పక్కా హిందుత్వ వాదిగా ఉంటూ దేశ రక్షణ కోసం అనేక రకాలుగా సేవలు అందించినటువంటి మహావీరుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు. మీ నమ్మకం, సంకల్పం మరియు అభిరుచితో బలమైన శత్రువులను ఓడించవచ్చు అని శివాజీ మహారాజ్ అందుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సులోచన, ఉపాధ్యాయుల బృందం పాల్గొంది.

## వలిగొండలో అభివృద్ధి పనుల జోరు

- సి.సి. రోడ్డు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే
- వలిగొండ పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే కుంభం ప్రత్యేక దృష్టి
- చిరు వ్యాపారులకు శాశ్వత దుకాణాల హామీ
- విస్తరణ పనుల పర్యవేక్షణ.. అధికారులకు దిశానిర్దేశం

**వలిగొండ, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** వలిగొండ పట్టణంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం పలు పనులకు శంకుస్థాపన చేసి పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. వలిగొండ నుంచి లింగరాజుపల్లి వరకు, శివాలయం నుంచి గుట్ట కిందివరకు రూ.50 లక్షల వ్యయంతో మంజూరైన సి.సి. రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, పనులను నాణ్యతతో పాటు నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించిన అనంతరం వారికి శాశ్వత దుకాణాలు నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యాపారులకు స్థిరమైన ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





## అదిలాబాద్ అభివృద్ధిపై ప్రభు త్వం ప్రత్యేక దృష్టి

**ఆదిలాబాద్ (తొలివెలుగు):** అదిలాబాద్ అభివృద్ధిపై ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారించింద ని రోడ్లు భవనాల శాఖ ప్రభు త్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. ఆదిలా బాద్ జిల్లా అభివృద్ధికి దిశా ని ర్దేశం చేసే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు లైన ఎయిర్‌పోర్ట్, ఇండస్ట్రి యల్ పార్క్ పురోగతిపై రాష్ట్ర సచివాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమీక్ష సమావే శం జరిగింది. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అధ్యక్ష తన జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, తదు పరి కార్యాచరణపై విస్తృతం గా చర్చించారు. పార్లమెంట్ సభ్యుడు జి. నగేష్, శాసన స భ్యు డు పాయల్ శంకర్ ప్రత్యే క ఆహ్వాని తులుగా పాల్గొన్నా రు. ఈ రెండు ప్రాజెక్టులు జిల్లా అభివృద్ధికి తోడ్పడటమే కా కుండా స్థానిక యువతకు ఉ పాధి అవకాశాలు కల్పిస్తాయ ని వారు పేర్కొన్నారు. ఈ స మావేశంలో ఉన్నతాధి కారు లు శ్రీనివాసరాజ్, భరత్ రెడ్డి ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక అంశాలు, పరిపాల నా అనుమతుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికా స్ రాజ్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ అభివృద్ధిపై ప్రభు త్వం ప్రత్యేక దృష్టి పెట్టింద న్నారు. భూసేకరణ పారద ర్శకంగా, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పూర్తి చే యాలని సూచించారు. రెవె న్యూ, పరిశ్రమలు, వి మాన యాన శాఖల మధ్య సమన్వ యాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్ ఎ యిర్‌పోర్ట్, ఇండస్ట్రియల్ పా ర్క్ కార్యరూపం దాల్చితే ఉ త్తర తెలంగాణలో పారిశ్రామిక విప్లవానికి నాంది పడుతుంద ని, రవాణా వ్యవస్థ మెరుగు పడితే అంతర్జాతీయ పెట్టు బ డులను ఆకర్షించే అవకాశ ముందని వికాస్ రాజ్ పేర్కొ న్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో భూసేకరణ, పరిహారం పంపి ణీ ప్రక్రియను నిరంతరం పర్య వేక్షిస్తున్నామని, ప్రభుత్వ ఆదే శాల మేరకు పనులను వేగ వంతం చేస్తామని తెలిపారు.





## మాట నిలబెట్టుకున్న 'భాస్కర్ ఫౌండేషన్'

- 18వ వార్డులో సొంత ఖర్చుతో బోరు ఏర్పాటు
- మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందిస్తా: ఇఎల్‌వి భాస్కర్

**చౌటుప్పల్, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 18వ వార్డులో సొంత నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గురువారం వార్డులో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని కొత్త బోరు బావిని వేయించారు. గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ గెలుపుకు మద్దతు తెలిపిన భాస్కర్, "వార్డు అభివృద్ధికి నా వంతు తోడ్పాటు అందిస్తాను" అని ఇచ్చిన మాటను ఆచరణలో చూపించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు త్వరలోనే వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని ఏ వార్డులో సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా విస్తరించే పనులను వేగవంతం చేసి మూడు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం, మున్సిపల్ పాలకవర్గాన్ని కోరారు. మెరుగైన వైద్యం అందక ప్రజలు హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోందని, వర్షాకాలానికి ముందే ఆసుపత్రి అందుబాటులోకి వస్తే స్థానికులకు ఉపశమనం కలుగుతుందని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదవాడికి అందాలన్నదే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కౌన్సిలర్ బుడ్డ సురేష్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీని నిలబెట్టుకుని సొంత నిధులతో వార్డు సమస్యలను పరిష్కరిస్తున్న భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వార్డులో ఏర్పాటు చేసిన కౌన్సిలర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.





## రైతులకు యూరియా 'యాప్' తిప్పలు!



- యూరియా బుకింగ్ యాప్‌ను రద్దు చేయాలి
- రైతు వేదికల ద్వారానే సరఫరా చేయాలి
- ఏఓకు సీపీఐ నాయకుల వినతి

**రాజాపేట, ఫిబ్రవరి 19 (తొలివెలుగు):** రైతులకు యూరియా సరఫరాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాజాపేట వ్యవసాయ అధికారిణి పద్మజకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుళ్ల లింగం మాట్లాడుతూ.. యూరియా బుకింగ్‌ను యాప్ ద్వారా నిర్వహించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే మొత్తం యూరియా బుకింగ్ పూర్తవుతోందని, ఎక్కువ భూములు కలిగిన వారు సాగు చేయకుండానే అధిక మొత్తంలో యూరియా బుక్ చేసుకుంటున్నారని ఆరోపించారు. సన్నకారు రైతులకు స్మార్ట్‌ఫోన్ సదుపాయం సరిగా లేకపోవడంతో యాప్ ద్వారా బుకింగ్ చేయడం కష్టమవుతోందని తెలిపారు. ఈ విధానం వల్ల నిజంగా అవసరమైన రైతులకు ఎరువులు అందకుండా పోతున్నాయని విమర్శించారు. యూరియా బుకింగ్ యాప్‌ను రద్దు చేసి, రైతు వేదికల ద్వారా గ్రామాల వారీగా వాలంటీర్ల సహాయంతో భూమి పాసుబుక్, ఆధార్ కార్డు ఆధారంగా యథావిధిగా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే మరోసారి ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మూలపోచయ్య, గణేష్, రాములు, మల్లేశం తదితరులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# గ్లోబల్ సమ్మిట్‌తో రియల్ మార్కెట్ రైజింగ్

**విజన్ డాక్యుమెంట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యం**

**నివాసం, పర్యాటకం, గిడ్డంగులు, డేటా సెంటర్లలో పెట్టుబడులకు అవకాశం**

**ఫ్యూచర్ సిటీ, మూసీ మాస్టర్ ప్లాన్స్ తర్వాతే పెట్టుబడులపై స్పష్టత**



అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్ రూపంలో ప్రభుత్వం తీసుకున్న చొరవ ప్రశంసనీయం. రియల్ ఎస్టేట్‌కు జీవం.. ఉపాధి.. ప్రస్తుతం తరుణంలో ఈ ప్రాథమిక అంశంపై ప్రభుత్వం దృష్టిసారించడం కీలకం. విజన్ డాక్యుమెంట్‌తో ప్రభుత్వ దీర్ఘకాల విజన్‌పై స్పష్టత ఇవ్వడంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం నెలకొంటోంది. జాయింట్ వెంచర్లు, విదేశీ పెట్టుబడి అవకాశాలు పెరుగుతాయి. కొత్త ప్రాజెక్ట్‌లు, అనుమతుల్లో వేగం, పాలసీలతో సెంటిమెంట్ బలపడుతుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన విజన్ డాక్యుమెంట్‌లో తయారీ, ఐటీ, ఫార్మా వంటి రంగాలే కాదు సినిమా, క్రీడలు, సెమీ కండక్టర్లు, అంతరిక్షం, జీవ ఉత్పత్తులు, జీవ వైవిధ్యం వంటి అన్ని రంగాలతో సమగ్రంగా ఉంది. దీంతో నివాస, ఆఫీసు స్పేస్‌లోనే పర్యాటకం, క్రీడలు, గిడ్డంగులు, డేటా సెంటర్ల వంటి ఇతర రియల్టీ మాధ్యమాలలో కూడా పెట్టుబడి అవకాశాలు ఏర్పడ్డాయి.

**వెస్ట్ టు సౌత్..**

నగర రియల్టీ మార్కెట్‌లో ఇప్పటి వరకు వెస్ట్ హైదరాబాద్‌దే ఆధిపత్యం. బహుళ జాతి ఐటీ, ఆర్థిక సంస్థలు, డేటా సెంటర్లు పశ్చిమంలో కేంద్రీకృతమై ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. అలాగే ఈ ప్రాంతానికి శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్‌కు సులువైన కనెక్టివిటీతో పాటు విశాలమైన రహదారులు, మెరుగైన మురుగునీటి వ్యవస్థ, తాగునీరు, నిరంతరం విద్యుత్ వంటి మెరుగైన మౌలిక సదుపాయాలున్నాయి. దీంతో బహుళ అంతస్తుల నివాస, వాణిజ్య సముదాయాలు, అంతర్జాతీయ విద్యా, వైద్యం, వినోద సంస్థలకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా రాయదుర్గం, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి వెస్ట్ హైదరాబాద్‌లో భూములు హాట్‌కేక్‌లుగా మారాయి. ప్రభుత్వం నిర్వహించే వేలంలోనే ఎకరం రూ.వందల కోట్లు పలుకుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఖరీదైన ప్రాంతంలో సామాన్య, మధ్యతరగతికి సొంతిల్లు కలే. ఇలాంటి సమయంలో ప్రభుత్వం కొత్త ప్రాంతానికి అభివృద్ధిని విస్తరించడం హర్షించదగిన పరిణామం. నగరానికి దక్షిణ భాగమైన శ్రీశైలం జాతీయ రహదారి, నాగార్జున సాగర్ రాష్ట్ర రహదారి మధ్యలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించింది. దీంతో గ్రీన్‌ఫీల్డ్ నెట్ జీరో సిటీ పరిసర ప్రాంతాలలో మౌలిక వసతులు మెరుగవుతాయి. ఫలితంగా నివాస, వాణిజ్య సముదాయాలు వెలుస్తాయి. సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు అందుబాటు ధరల్లోనే సొంతింటి కలను సాకారం చేసుకునే వీలు ఏర్పడుతుంది. ఏ ప్రాజెక్ట్‌కైనా బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్) కీలకం. రాష్ట్రాభివృద్ధిని మార్చే కీలక ప్రాజెక్ట్‌లలో భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం కీలకమని పదే పదే ప్రభుత్వం చెబుతోంది. అలాంటి కీలకమైన ప్రాజెక్ట్‌లకు మాస్టర్ ప్లాన్ వస్తేనే పెట్టుబడులపై స్పష్టత వస్తుంది.



# ప్రియం కానున్న బెంజ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ కూడా వాహన ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. జనవరి నుంచి అన్ని రకాల వాహన ధరలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు వెల్లడించింది. యూరోతో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోవడంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను పెంచాల్సివస్తున్నదని పేర్కొంది. ప్రస్తుతం రూపాయి-యూరో విలువ 100కి పడిపోయింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు లాజిస్టిక్ ఖర్చులు కూడా అధికమడం కూడా ధరల పెంపునకు ప్రధాన కారణాలని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో 19% వృద్ధి

**వాహన తయారీదారుల సంఘం సియామ్ వెల్లడి**



ముంబై: పండగ సీజన్ తర్వాత కూడా ప్యాసింజర్ వాహనాలకు (కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) డిమాండ్ కొనసాగింది. ఈ నవంబర్‌లో కంపెనీల నుంచి డీలర్లకు మొత్తం 4,12,405 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు సరఫరా అయ్యాయి. గతేడాది ఇదే నవంబర్‌లో సరఫరా 3,47,522తో పోలిస్తే ఇది 19% అధికంగా ఉందని భారత వాహన తయారీదారుల సంఘం సియామ్ తెలిపింది. కార్ల తయారీ అగ్రగామి మారుతీ సుజుకీ సరఫరా 1,41,312 నుంచి 21 % పెరిగి 1,70,971 యూనిట్లకు చేరింది. మహీంద్రా అండ్ మహీంద్రా 56,336 యూనిట్లను సరఫరా చేసింది. ఇదే నవంబర్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా డీలర్లకు 50,340 యూనిట్లను పంపిణీ చేసింది. చక్రవాహనాల పంపిణీలో 21% వృద్ధి నమోదైంది. ఈ నవంబర్‌లో మొత్తం సరఫరా 16,04,749 యూనిట్ల నుంచి 19,44,475 చేరింది. మోటార్‌సైకిల్ విభాగంలో 11,63,751 యూనిట్లు, స్కూటర్ల విభాగంలో 7,35,753 యూనిట్ల సరఫరా జరిగింది. అయితే మోపెడ్ సిగ్మెంట్‌లో 2% క్షీణత నమోదైంది. మొత్తం 45,923 యూనిట్ల నుంచి 44,971 యూనిట్లకు పరిమితమయ్యాయి. త్రీ వీలర్స్ అమ్మకాలు 21% వృద్ధితో 71,999 యూనిట్లుగా నమోదయ్యాయి. "పండుగ డిమాండ్ కొనసాగింపు, కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 సంస్కరణ దన్ను భారతీయ ఆటో పరిశ్రమ నవంబర్‌లోనూ అమ్మకాల జోరును కనబరించింది. ప్యాసింజర్, టూ వీలర్స్, త్రీ వీలర్స్ విభాగాలకు సంబంధించి ఈ ఏడాదిలో నవంబర్ అత్యధికంగా అమ్ముడైన నెలగా రికార్డు సృష్టించింది. ప్రజారంజకనమైన ప్రభుత్వ సంస్కరణలు, మెరుగుపడుతున్న మార్కెట్ సెంటిమెంట్‌తో వచ్చే ఏడాది (2026)లోనూ ఇదే వృద్ధి నమోదవుతుందని పరిశ్రమ ఆశాభావంతో ఉంది" అని సియామ్ డైరెక్టర్ రాజేశ్ మీనన్ తెలిపారు.

## జియో లేటెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్: యూజర్లకు పండగే!

రిలయన్స్ జియో తన కొత్త ప్రీపెయిడ్ టారిఫ్ పోర్ట్‌ఫోలియోను "హ్యాపీ న్యూ ఇయర్ 2026" ప్లాన్‌లను ఆవిష్కరించింది. ఇందులో నెల రోజుల ప్లాన్, ఏడాది ప్లాన్ రెండూ ఉన్నాయి. ఈ కొత్త రీఛార్జ్ ప్లాన్స్ వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. ఏడాది పాటు రీఛార్జ్ కావాలనుకునే వారి కోసం రిలయన్స్ జియో ఈ ప్లాన్ పరిచయం చేసింది. రూ. 3599లతో రీఛార్జ్ చేసుకుంటే.. 365 రోజులు చెల్లుబాటు అవుతుంది. రోజుకు 2.5 జీబీ 5జీ డేటా, 100 %టామీ%లు, అపరిమిత కాల్స్ పొందవచ్చు. అదనంగా గూగుల్ జెమిని ప్రో ప్లాన్‌కు 18 నెలల ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పొందవచ్చు.

**సూపర్ సెలబ్రేషన్ మంత్లీ ప్లాన్**

సూపర్ సెలబ్రేషన్ మంత్లీ ప్లాన్ పేరుతో 500 రూపాయల రీఛార్జ్ ప్లాన్ కూడా జియో ప్రకటించింది. ఇది 28 రోజుల చెల్లుబాటు ఉన్నప్పటికీ.. రోజుకు 2జీబీ డేటా, 100 SMS\T, అపరిమిత కాల్స్ పొందవచ్చు. అదనంగా ఓటీటీ ప్రయోజనాలు (యూట్యూబ్ ప్రీమియం, జియో హాట్‌స్టార్, సోని లివ్, జీ5 మొదలైనవి) లభిస్తాయి. యాన్యువల్ ప్లాన్ మాదిరిగానే 18 నెలల ఉచిత గూగుల్ జెమిని ప్రో ప్లాన్ కూడా పొందవచ్చు. ఫ్లెక్సీ ప్యాక్ పేరుతో.. 103 రూపాయల రీఛార్జ్ ప్లాన్ కూడా తీసుకొచ్చింది. దీని వ్యాలిడిటీ 28 రోజులు మాత్రమే. అయితే ఇందులో కేవలం డేటా మాత్రం లభిస్తుంది. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకున్న వినియోగదారుడు.. హిందీ, ఇంటర్నేషనల్, ప్రాంతీయ ప్యాక్‌లలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

# స్టేట్ బ్యాంకు శుభవార్త.. అప్పు తీసుకున్నోళ్లకు..

తమ బ్యాంకులో అప్పు తీసుకున్నోళ్లకు ప్రభుత్వ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. కేంద్ర బ్యాంకు ఆర్బీఐ ఇటీవల రెపో రేటును తగ్గించిన తరువాత, ప్రధాన బ్యాంకులు ఈ ప్రయోజనాలను వినియోగదారుల కు బదిలీ చేసే పనిలో ఉన్నాయి. తాజాగా ఎస్‌బీఐ కూడా తన కీలక రుణ రేట్లో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసీఎల్‌ఆర్), ఎక్స్‌టర్నల్ బెంచ్మార్క్ లెండింగ్ రేట్ (ఈబీఎల్‌ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేట్ (ఆర్ఎల్ఎల్‌ఆర్), బెంచ్మార్క్ ప్రైమ్ లెండింగ్ రేట్ (బీపీఎల్‌ఆర్), బేస్ రేట్లో కోతలు ఉన్నాయి. డిసెంబర్ 15 నుండి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి. మారిన వడ్డీ రేట్లతో ఈ బ్యాంకులో రుణ గ్రహీతలకు వడ్డీ భారం తగ్గనుంది. నెలవారీ వాయిదాలు (%జువీ×%) తగ్గుతాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల రెపోరేటు అంటే వాణిజ్య బ్యాంకులకు తాత్కాలికంగా ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్ల తగ్గించింది. దీంతో ఇది 5.25 శాతానికి తగ్గింది. వృద్ధికి తోడ్పడటానికి ఈ ఏడాది నాల్గవసారి కీలక వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించాలని గత వారం ఆర్‌బీఐ విధాన కమిటీ నిర్ణయం తీసుకుంది.

**సవరించిన ఎంసీఎల్‌ఆర్ రేట్లు**

చాలా రిటైల్ రుణాలకు కీలకమైన ఎంసీఎల్‌ఆర్ రేటును అన్ని కాలపరిమితిలలోనూ ఎస్‌బీఐ తగ్గించింది. ఓవర్‌నైట్, ఒక నెల రేట్లు 7.90% నుండి 7.85%కి తగ్గాయి. మూడు నెలల ఎంసీఎల్‌ఆర్ 8.30 శాతం నుంచి 8.25 శాతానికి రాగా, ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్ 8.65 శాతం నుంచి 8.60 శాతానికి తగ్గింది. అనేక గృహ, వాహన రుణాలకు ఉపయోగించే క్లిష్టమైన ఒక సంవత్సరం కాలపరిమితి రుణ రేటు 8.75% నుండి 8.70%కి దిగొచ్చింది. ఇక రెండేళ్ల టెన్యూర్ రుణాలపై 8.80% నుండి 8.75%, మూడేళ్ల కాలపరిమితి లోన్లపై 8.85 % నుండి 8.80 శాతానికి వడ్డీని ఎస్‌బీఐ సవరించింది.


**ఈబీఎల్‌ఆర్, ఆర్ఎల్ఎల్‌ఆర్ కోతలు**

క్రెడిట్ రిస్క్ ప్రీమియం బ్యాంక్ స్ప్రెడ్ (%దీ్రా%)తో కూడిన ఈబీఎల్‌ఆర్‌ను ఎస్‌బీఐ 8.15% నుండి 7.90%కి తగ్గించింది. ఆర్బీఐ రెపో రేటుతో నేరుగా ముడిపడి ఉన్న ఆర్ఎల్ఎల్‌ఆర్ 7.75% ం %జ్రా% నుండి 7.50% +CRP కి దిగొచ్చింది. ఫలితంగా రుణగ్రహీతలు తమ రిస్క్ ప్రొఫైల్ ఆధారంగా ఈఎంఐలలో తగ్గింపులను చూస్తారు.

# పసిడి ధర మరింత పెరుగుతుందా?

బంగారం ధరలు అదే పనిగా ర్యాలీ చేస్తుండం తప్పకుండా ఆకర్షిస్తుంది. అవును బంగారం ధరలు ఇటీవలి కాలంలో గణనీయమైన రాబడిని ఇచ్చాయి. కానీ, ఇంకెంత పెరుగుతుందన్నది సమాధానం లేని ప్రశ్నే అవుతుంది. ఏ అసెట్ క్లాస్‌కు అయినా ఇదే వర్తిస్తుంది. కనుక దీనికి బదులు మీ పెట్టుబడుల్లో బంగారాన్ని చేర్చుకోవడం వల్ల ఒనగూరే ప్రయోజనాలనే పరిగణనలోకి తీసుకోవాలి. అనిశ్చితుల్లో బంగారం మంచి పనితీరు చూపిస్తుంటుంది. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల సమయంలో లేదా ఈక్విటీ మార్కెట్లు ఆటుపోట్లను ఎదుర్కొంటున్న తరుణంలో బంగారం ధరలు పెరుగుతుంటాయి. అలాంటి అనిశ్చితులన్నీ సర్దుకుని, ఆర్థిక వ్యవస్థలు మంచి పనితీరు చూపిస్తుంటే అప్పుడు బంగారం పనితీరు పరిమితం అవుతుంది. గత 15 ఏళ్లలో బంగారం ఏటా 10 శాతం రాబడిని అందించింది. వివిధ రంగాలు, పరిమాణంతో కూడిన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఇదే కాలంలో ఏటా ఇచ్చిన రాబడి 12 శాతంగా ఉంది. రాబడిలో వ్యత్యాసం స్వల్పమే అయినప్పటికీ దీర్ఘకాలంలో కాంపౌండింగ్ కారణంగా చెప్పుకోతగ్గంత అదనపు నిధి సమకూరుతుంది. ఈక్విటీలు అన్నవి వ్యాపారాల్లో వాటాలను అందిస్తాయి. అవి సంపదకు వీలు కల్పిస్తాయి. బంగారం కేవలం నిల్వ ఉంచుకునే సాధనమే. కనుక ఇన్వెస్టర్లు తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా మొత్తం పెట్టుబడుల్లో 10 శాతం వరకు బంగారానికి కేటాయించుకోవచ్చు.

# ఈవీ బ్యాటరీలకు భారీ డిమాండ్



భారత్‌లో ఎలక్ట్రిక్ వాహన బ్యాటరీ (ఈవీ బ్యాటరీ) డిమాండ్ వచ్చే ఏడేళ్లలో గణనీయంగా పెరనుందని కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ (సీఈఎస్) సంస్థ అంచనా వేసింది. 2025లో ఈవీ బ్యాటరీ డిమాండ్ 17.7 గిగావాట్ హవర్ (జీడబ్ల్యూహెచ్) ఉండగా, 2032 నాటికి 256.3 గిగావాట్లకు చేరుకోనున్నట్టు తెలిపింది. ఏటా 35 శాతం కాంపౌండెడ్ వృద్ధి (సీఏజీఆర్) ఈ రంగంలో నమోదు కావొచ్చని అంచనా వేసింది. ఇంధన ధరలు పెరుగుతుండడం, ఎలక్ట్రిఫికేషన్‌ను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుండడం, వినియోగదారుల నుంచి బలమైన డిమాండ్, ఎప్పటికప్పుడు కొత్త మోడళ్లు విడుదల అవుతుండడం, విధానపరమైన మద్దతు అన్నీ కలసి ఈవీ మార్కెట్ భారీ వృద్ధికి అనుకూలిస్తున్నట్టు తన నివేదికలో సీఈఎస్ వివరించింది. "భారతదేశ ఎలక్ట్రిక్ వాహన విప్లవానికి బ్యాటరీ కెమిస్ట్రీ పురోగతులు కీలకమైనవి. ఎల్‌ఎఫ్‌పీ జెన్ 4, సోడియం అయాన్ టెక్నాలజీ ఆవిష్కరణలు కేవలం సాంకేతికపరమైన పురోగతులే కాదు. ఎలక్ట్రిక్ వాహనాలను మరింత అందుబాటు ధరలకు తీసుకొచ్చే సంచలనాలు. సురక్షితమైన, ఒక్కచార్జ్‌తో మరింత దూరం ప్రయాణించేందుకు వీలు కల్పిస్తాయి"అని సీఈఎస్ ఎండీ వినాయక్ వలింబే తెలిపారు. ఎల్‌ఎఫ్‌పీ జెన్4 సెల్స్ అన్నవి ఇప్పుడు 300 వాట్‌హవర్/కిలోని అధిగమించాయంటూ.. ఎక్కువ దూరం ప్రయాణించేందుకు, ధరలు తగ్గేందుకు అనుకూలిస్తాయ ఈ నివేదిక తెలిపింది.

సవాళ్లను అధిగమించాలి..

భారత్ తన ఎలక్ట్రిఫికేషన్ (ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లడం) లక్ష్యాలను సాధించేందుకు వీలుగా పరిశ్రమతో సహకారం, బలమైన బ్యాటరీ ఎకోసిస్టమ్ ఏర్పాటు, వ్యూహాత్మక పెట్టుబడుల సవాళ్లను అధిగమించేందుకు విధానపరమైన జోక్యం అవసరమని సీఈఎస్ నివేదిక సూచించింది. బ్యాటరీల్లో వినియోగించే కీలక ముడి పదార్థాలను, ఖనిజాలపై చైనా నియంత్రణలు.. భారత్‌లో గిగాఫ్యాక్టరీల నిర్మాణాన్ని నిదానింపజేయొచ్చని, సరఫరా వ్యవస్థ రిస్క్‌లకు దారితీయొచ్చని హెచ్చరించింది. అధిక ఆరంభ పెట్టుబడులకుతోడు, దేశీయంగా ఖనిజ నిల్వలు పరిమితంగా ఉండడం భారత స్వావలంబన లక్ష్యాలకు విఘాతం కలిగిస్తాయని పేర్కొంది.

# రాజమౌళి 'వారణాసి'లో నా పాత్ర ఇదే

సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా దర్శక దిగ్గజం రాజమౌళి కలయికలో వస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'వారణాసి'. ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుండగా మలయాళ నటుడు పృధ్వి రాజ్ సుకుమారన్ నెగిటివ్ రోల్ లో కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్ ఒక పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా గురించి ఆయన ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ మరోసారి తన నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో తన పాత్ర గురించి ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ.. "నేను వారణాసిలో ఒక మహా శివ భక్తుడిని" ఈ పాత్ర చాలా శక్తివంతంగా, ఆధ్యాత్మికతతో కూడి ఉంటుందని మహేశ్ కు తండ్రిగా నటిస్తున్నాను అని' పేర్కొన్నారు. వారణాసి నేపథ్యంలో సాగే ఈ కథలో ఆయన పాత్ర సినిమాకే హైలైట్‌గా నిలవబోతోందని సమాచారం. తెలుగు తెరపై తండ్రి–కొడుకుల సెంటిమెంట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మహేష్ బాబు మరియు ప్రకాష్ రాజ్ నిలుస్తారు. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దూకుడు', 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' మరియు 'మహర్షి' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు 'వారణాసి' చిత్రంతో ఈ హిట్ కాంబినేషన్ మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది. మరోసారి తండ్రి–కొడుకులుగా వీరు అలరించబోతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్న వారణాసి 2027 ఏప్రిల్ 7న వాల్డ్‌డీ వైడ్ గా రిలీజ్ కాబోతోంది.






# కొంచెం టెన్షన్ గానే 'పెద్ది'?

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ఇప్పుడు నటిస్తున్న అవైటెడ్ చిత్రమే "పెద్ది"(గ్రావసుసుఅ). యువ దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో చేస్తున్న ఈ రూరల్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ పట్ల మంచి బజ్ ఉంది. దీనితో ఈ సినిమా కోసం చూస్తున్న అభిమానులు ఈ చిత్రం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఆల్రెడీ ఈ సినిమా ఒకసారి వాయిదా పడింది. కొత్త డేట్ గా ఈ ఏప్రిల్ 30 ని సెట్ చేశారు. అయితే ఈ డేట్ కి రావడానికి మేకర్స్ అహర్నిశలు ఇప్పుడు శ్రమిస్తున్నారట. షూటింగ్ ఇంకా బాకీ ఉంది. దీనితో అనుకున్న టార్గెట్ లోపే రావాలనే టెన్షన్ కూడా ఇంకో పక్క ఉందట. సో ఈ కొత్త డేట్ విషయంలో కూడా అభిమానులు కొంచెం ఇప్పుడు నుంచే ప్రిపేర్డ్ గా ఉంటే బెటర్ అనుకోవచ్చు. ఆన్ టైం వచ్చేస్తే హ్యాపీనే కానీ మళ్ళీ వాయిదా అంటే అభిమానులకి మరోసారి నిరాశగా మిగులుతుంది. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# నిర్మాతగా నిత్యా మీనన్

"సినిమాలు తీయడమంటే కథలు చెప్పడం మాత్రమే కాదు... నాకు అంతకన్నా ఎక్కువ. మనుషుల అంతరంగాన్ని తాకే ప్రక్రియ అది. మన ఆలోచనకు మించిన చోటుకి వెళ్లి, అక్కడి మనుషులను చేరుకోవడం అన్నమాట. అలాంటి సినిమాలు తీయాలన్నది నా ఆకాంక్ష" అంటున్నారు నిత్యా మీనన్. బాలనటిగా 1998లో కెరీర్ ఆరంభించి, ఆ తర్వాత ఓ పదేళ్లు పలు భాషల చిత్రాల్లో నటించారామె. 'అలా మొదలైంది' (2011)తో తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయమయ్యారు నిత్యా మీనన్. ఇన్నేళ్లుగా మాతృభాష మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ వంటి భాషల్లో కథానాయికగా సినిమాలు చేస్తూ వస్తున్నారు నిత్యా మీనన్. ఇప్పుడు నిర్మాతగా మారుతున్నారు. సొంత బేనర్‌కి 'కేయూరీ ప్రొడక్షన్స్' అని పేరు పెట్టారు. ఈ విషయాన్ని మంగళవారం సోషల్ మీడియా వేదికగా తెలిపారు నిత్యా మీనన్. "మనుషులు చేయలేని అద్భుతాలను సినిమాలు సృష్టిస్తాయి. అలాంటి అద్భుతమైన సినిమాలు చేయాలని నటిగా నా కెరీర్ మొదలుపెట్టినప్పుడే అనుకున్నాను. ఇప్పుడు నిర్మాతగా కూడా నా ఆలోచన అదే. సమాజాన్ని ప్రభావితం చేసే కథలు తెరపైకి తీసుకురావాలన్నది నా లక్ష్యం. కథకు, పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చే సినిమాలే ఈ బేనర్ నుంచి వస్తాయి" అని నిత్య పేర్కొన్నారు. అయితే ఈ బేనర్‌పై నిర్మించనున్న తొలి సినిమా గురించిన వివరాలేమీ ఆమె తెలియజేయలేదు.





# దాని కోసం దర్శకుల వెంటపడక తప్పడంలేదు: మృణాల్ ఠాకూర్

సినిమా ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి స్టార్‌గా ఎదగడం అంటే చిన్న విషయం కాదు. అందులోను ముఖ్యంగా హీరోయిన్ లకు.. ఎంత అందంగా ఉన్నప్పటికి స్టార్ డమ్ సంపాదించుకోవాలి అంటే తిప్పలు పడాల్సిందే. కొంత మందికి అదృష్టం బాగుండి అవకాశాలు వస్తాయి అందులో మృణాల్ ఠాకూర్ ఒకరు. తన అందం, అభినయంతో సౌత్ నార్త్ ప్రేక్షకులను మాయ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం ఆమె నటించిన లేటెస్ట్ మూవీ 'దో దీవానే షెహర్ మే' విడుదల సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా మృణాల్ తన కెరీర్ తొలినాళ్లలో పడ్డ కష్టాలను పంచుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంచి పాత్రల కోసం దర్శకుల వెంట పడటంలో ఏమాత్రం తప్పు లేదని మృణాల్ స్పష్టం చేశారు.. 'మనం ఒక పాత్ర కోసం ఎంత ఆకలితో (ఎబఅస్త్రతీఎ టశీతీ షశీతీ) ఉన్నామో తెలిస్తేనే దర్శకుల ఆలోచనా విధానం మారుతుంది' అని ఆమె అభిప్రాయపడ్డారు. తన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' అవకాశం కూడా అలానే వచ్చిందని ఆమె వెల్లడించారు. దర్శకుడు రవి ఉద్యావర్ తెరకెక్కించిన 'మామ్' సినిమా చూసి ఫిదా అయిపోయిన మృణాల్, నేరుగా ఆయన్ని కలిసి.. "సర్, మనం సినిమా ఎప్పుడు చేస్తున్నాం?" అని అడిగేశారట. ఆమెలోని ఆ ధైర్యమే నేడు ఈ భారీ ప్రాజెక్టులో అవకాశం తెచ్చిపెట్టింది. గతాన్ని గుర్తుచేసుకుంటూ.. "మొదట్లో నాకు పని ఎలా అడగాలో కూడా తెలియదు. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్య ధర్ గారినే నేను మొదటిసారి అవకాశం అడిగాను.

# సిద్ధూతో జతకట్టబోతున్న భాగ్యశ్రీ బోర్సే..

స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కిన 'తెలుసు కదా' అనే చిత్రంతో ఇటీవలే ప్రేక్షకులను పలకరించారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. తాజాగా ఆయన నెక్స్ట్ సినిమా గురించి సోషల్ మీడియాలో పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తెలుసు కదా చిత్రం తర్వాత కాస్త విరామం తీసుకున్న సిద్ధూ ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను లైన్‌లో పెట్టినట్లు సమాచారం. ఈ సినిమాకు ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ ఫేమ్ స్వరూప్ ఆర్‌ఎస్ దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో సిద్ధూకి జోడిగా వెండి తెరపై అలరించే బ్యూటీ పేరు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ బ్యూటీ ఎవరో తెలుసా.. భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం ఈ వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. స్వరూప్ ఆర్‌ఎస్ దర్శకత్వం సిద్ధూ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా ఎంపికైందని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ చిత్రాన్ని సితార నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించబోతున్నట్లు టాక్ నడుస్తుంది. ఇదే నిజం అయితే ఈ బ్యానర్‌లో భాగ్యశ్రీ బోర్సేకి హ్యాట్రిక్ సినిమా అవుతుంది. నిజానికి ఇప్పటి వరకు దీనికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రకటనలు రాలేదు. త్వరలోనే మేకర్స్ ఈ రూమర్స్‌కు చెక్ పెట్టి అఫీషియల్‌గా అనౌన్స్ చేస్తారేమో చూడాలి. భాగ్యశ్రీ గతంలో సితారలో కింగ్డమ్ మూవీలో హీరోయిన్ చేసింది, ప్రస్తుతం సితార నిర్మాణంలో అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న లెనిన్ సినిమాలో కూడా ఈ బ్యూటీ హీరోయిన్‌గా సందడి చేయబోతుంది. తాజాగా రూమర్స్ ప్రకారం.. త్వరలో సితార బ్యానర్‌లో తెరకెక్కబోతుందని ప్రచారంలో ఉన్న సిద్ధూ సినిమాలో కూడా భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించబోతుందని వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలు నిజం అయితే సితారలో ఈ బ్యూటీకి హ్యాట్రిక్ సినిమాలు దక్కినట్లు అవుతుంది. దీనికి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

